మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న మాల మహానాడు నాయకులు

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలల ర్యాలీ

కడ్తాల్, ఫిబ్రవరి 14: రాజ్యాంగానికి విరుద్ధంగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణను అంగీకరించబోమని మాల మహానాడు నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ, మాల మహానాడు ఆధ్వర్యంలో శుక్రవారం తలకొండపల్లి మండల కేంద్రంలో బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పలు వ్యాపార సంస్థలను స్వచ్ఛందంగా మూసివేశారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణలో మాలలకు కేవలం ఐదు శాతమే రిజర్వేషన్ కల్పించి తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. వర్గీకరణను అమలు చేయడాన్ని ప్రభుత్వం పునరాలోచించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, మల్లేశ్, కిరణ్ కుమార్, పురుషోత్తం, వెంకటేశ్, శ్రీను, గోపాల్, శంకర్, విజయ్ పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

యాచారం, ఫిబ్రవరి14: మండలంలోని గాండ్లగూడ గ్రామంలో యాచారం పోలీసులు సైకిల్ పెట్రోలింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్, గంజాయి తదితర అంశాలపై యువత, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ నేరాలు, ఆన్‌లైన్ గేమ్స్, గంజాయి, మత్తు పదార్థాలు. మత్తు పానీయాలు, ధూమపానం, పేకాట తదితర చెడు వ్యసనాలకు యువత అలవాటు పడొద్దని వారు సూచించారు. దోపిడీలు, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నా వెంటనే 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి దామోదర్‌యాదవ్

యాదవుల జనాభా గణాంకాలను ప్రకటించాలి

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 14: రాష్ట్రంలోని యాదవుల జనాభా గణాంకాలను ప్రకటించాలని యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి దామోదర్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా 50లక్షలకు పైగా ఉన్న యాదవుల జనాభాను తగ్గించి చూపడం సరికాదన్నారు. ప్రభుత్వం నిర్వహించిన కుటుంబ సర్వే ఫలితాలను బీసీ కులాల వారీగా గణాంకాలను ప్రకటించాలని, జనాభా నిష్పత్తిన రిజర్వేషన్లను కల్పించిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్నారు. బీసీల సంఖ్యను తక్కువగా చూపించి వారి రాజకీయ హక్కులు, విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను దెబ్బతీసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు అంజన్‌యాదవ్, తిరుమలేష్‌యాదవ్, చెన్నకేశవులుయాదవ్, నర్సింగ్‌యాదవ్, సాయికుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

అమర సైనికుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాఘవేందర్, నాయకులు

పుల్వామా వీరులకు ఘన నివాళి

కడ్తాల్, ఫిబ్రవరి 14: పుల్వామా ఘటనలో వీర మరణం పొందిన సైనికులకు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ ఆధ్వర్యంలో, ఉగ్రవాదుల దాడిలో అమరులైన జవాన్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ రక్షణలో అమరులైన సైనికుల త్యాగం మరవలేనిదని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భీక్యానాయక్, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బిచ్యానాయక్, నర్సింహ, బీజేపీ మండలాధ్యక్షుడు మహేశ్, నాయకులు కుమార్‌గౌడ్, వెంకటేశ్, కృష్ణ, కుమార్, నిరంజన్, విజయ్‌నాయక్, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చేవెళ్ల పట్టణ కేంద్రంలో..

చేవెళ్లటౌన్ : పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్లకు శుక్రవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేవెళ్ల పట్టణ కేంద్రంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా సుష్మా స్వరాజ్ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అనంతరెడ్డి, మచ్చేందర్‌రెడ్డి ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం

యాదయ్య (ఫైల్)

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 14: బ్యాంకులో డబ్బులు తీసుకొస్తానని ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చేవెళ్ల ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి వివరాల ప్రకారం.. షాబాద్ మండల పరిధిలోని ఎట్లాఎర్రవల్లి గ్రామానికి చెందిన యాదయ్య (48) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 10న చేవెళ్ల మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో డబ్బులు తీసుకొస్తానని వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన భార్య బోడ జయమ్మ చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు బంధువుల వద్ద వెతికినా భర్త ఆచూకీ లభించకపోవడంతో చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజలకు తాగునీరందిస్తాం

కొత్తూరు, ఫిబ్రవరి 14: తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీ అన్నారు. మున్సిపాలటీ పరిధిలోని ఫాతిమాపూర్‌లో శుక్రవారం బోరు వేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఏ వార్డులో నీటి సమస్య ఉన్నా పరిష్కారానికి కృషి చేస్తున్నామని వివరించారు. వేసిన బోర్‌లో నీళ్లు రావడంతో అందరూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌యాదవ్, యాదయ్య, కృష్ణయాదవ్, ఆల్విన్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, లూథ్‌రెడ్డి, బాల్‌శివరెడ్డి పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమానికి బియ్యం అందజేత

యాచారం, ఫిబ్రవరి14: మండలంలోని ఆగపల్లిలో ఉన్న ఓ అనాథ ఆశ్రమానికి యాచారం సీఐ నరసింహారావు రెండు క్వింటాళ్ల బియ్యాన్ని శుక్రవారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అనాథ ఆశ్రమాలను ఆదుకోవడానికి దాతలు, యువకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు రావాలన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది, అనాథ ఆశ్రమ నిర్వాహకులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 14 : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని పాషా, నరహరి స్మారక కేంద్రంలో సీపీఎం రంగారెడ్డిజిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అదికారంలోకి రాకముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఫార్మాసిటీ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. బలవంతపు భూసేకరణ నిలిపివేసి, ఫార్మాసిటిపై హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం అమలు చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భాస్కర్, సామెల్, రామచందర్, నర్సింహ, జగన్, జగదీశ్, జంగయ్య, నర్సింహ, బుగ్గరాములు, జగన్, బాలరాజు, దేవేందర్, పెంటయ్య, శేఖర్ తదితరులున్నారు.

మూగజీవాల సంరక్షణకు జాగ్రత్తలు పాటించాలి

మూగజీవాలకు సంబంధించి మందులు అందజేస్తున్న వైద్యసిబ్బంది

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 14 : మూగజీవాలకు సోకే వ్యాధులను ముందుగా గుర్తించి వైద్యుల సూచనల మేరకు సరైన చికిత్సలు నిర్వహించాలని పశువైద్యాధికారి ఆనంద్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కప్పాడు గ్రామంలో శుక్రవారం పశువులకు నట్టల నివారణ మందులు తాపించటంలో పాటు 30 మూగజీవాలకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 25 పశువులకు పాల దిగుబడి పెంచే మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ..మూగజీవాలకు ఎలాంటి వ్యాధులు సోకినా సరైన వైద్య చికిత్సలు పశువైద్యాధికారుల సూచనల మేరకు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో గోపాల మిత్రులు జగన్, వెంకట్‌రెడ్డి, సురేదర్, సతీష్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు తరలిరండి

సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 14: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు గిరిజనులు భారీగా తరలి రావాలని మండల గిరిజన నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. గిరిజన ఆరాధ్యదైవమైన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను కడ్తాల్ పట్టణంలో శనివారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ ఉపసర్పంచ్ పాండునాయక్, నాయకులు శ్రీనూనాయక్, పత్యానాయక్, భీక్యానాయక్, కుమార్‌నాయక్, భీమన్‌నాయక్, పవన్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, గోపినాయక్, ప్రకాశ్‌నాయక్ పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులు ప్రారంభం

మొయినాబాద్, ఫిబ్రవరి14: మండల పరిధిలోని నక్లపల్లి–షాబాద్ మండల పరిధిలోని చందన్‌వెల్లి, సోలిపేట్ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న ఈసీ వాగుపై వంతెన నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే 2023లో ఏప్రిల్‌లో శంకుస్థాపన చేశారు. కొన్ని కారణాలతో పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రస్తుతం వంతెన నిర్మాణ పనులను శుక్రవారం కాంట్రాక్టర్ నక్కలపల్లి గ్రామ ప్రజలతో కలిసి ప్రారంభించారు. ఈ వంతెన నిర్మాణం పూర్తి అయితే హైతాబాద్‌లో ఏర్పాటు చేసిన ఇండస్ట్రీయల్ ప్రాంతానికి వాహనాల రాకపోకలు సులభతరం కానున్నదని ఇరు మండలాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దాడి హేయమైన చర్య

నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 14: రంగారెడ్డి జిల్లా జడ్జిపై దాడి చేయడం హేయమైన చర్య అని ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేపల్లి జగన్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా జడ్జిపై గురువారం జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం జూనియర్ సివిల్ జడ్జి, ప్రథమ శ్రేణిన్యాయస్థానం ఆవరణలో ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేసన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు యాదవ్, న్యాయవాదులు యాదిలాల్, రామకృష్ణ, శేఖర్, మధు, సర్దార్, శేఖర్, జగన్, శీరీష్, బిక్య, శ్రీను పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

సహకార సంఘాల అభివృద్ధికి కృషి

ఆదిబట్ల, ఫిబ్రవరి 14: ప్రతి రైతుకు అందుబాటులో హెచ్‌డీసీసీబీ బ్యాంకులు ఉన్నాయని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిబట్లలో రూ.10 కోట్లతో హెచ్‌డీసీసీబీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బ్యాంకులను నంబర్‌వన్ స్థానంలో ఉంచుతామని అన్నారు. సహకార సంఘాలను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళుతున్నామన్నారు. జిల్లా బ్యాంకు ఇప్పటికే రూ.200 కోట్లతో అభివృద్ధి పథంలో ముందుకెళుతున్నామన్నారు. ప్రతి మండలంలోని సంఘాలకు ప్రత్యేకంగా పక్కా భవనాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రైతుకూ పంట రుణాలతో పాటు ప్రతి రుణం వారం రోజుల్లో మంజూరు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహకార సంఘం అధ్యక్షుడు సత్తయ్య, ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఆయా సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 14: గుడిసెలు వేసుకున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇండ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలో ఇండ్లు లేని పేదలు గుడిసెలు వేసుకుని రెండు సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా రెండో వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా ఇండ్లు లేని పేదలు వేసుకున్న గుడిసెల వద్ద ప్రభుత్వం ఎలాంటి మౌలిక సదుపాయం కల్పించలేదన్నారు. భూ పోరాటం చేస్తున్న గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, నాయకులు అంజయ్య, శ్రీనివాస్, జంగయ్య, మక్బుల్, లలితమ్మ, సుగుణమ్మ, రమాదేవి, పెంటయ్య, శ్రీకాంత్ ఉన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

మాడ్గుల, ఫిబ్రవరి14: సీఎం సహాయనిధి చెక్కులు పేదలకు వరం లాంటిదని సుద్దపల్లి గ్రామ మాజీ సర్పంచ్‌లు యాచారం వెంకటేశ్వర్‌గౌడ్, గ్యార నరసింహులు అన్నారు. మండల పరిధిలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన డొంకి గ్యార శివానికి రూ.19,500 కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయని, వాటిని సుద్దపల్లి గ్రామంలో బాధితురాలికి శుక్రవారం వారు అందజేశారు. కార్యక్రమంలోని శేఖర్‌గౌడ్, శ్రీనివాస్, సత్యం, మోహన్‌రావు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

నర్సరీని పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ రామచందర్

కొందుర్గు, ఫిబ్రవరి 14: కొందుర్గు మండల పరిధిలోని పులుసుమామిడి, మహదేవ్‌పూర్, భైరంపల్లి గ్రామాల్లోని నర్సరీలను శుక్రవారం ప్లాంటేషన్ సూపర్ వైజర్ రామచందర్, టెక్నికల్ అసిస్టెంట్ మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా నర్సరీల్లో మొక్కల పెంపకం కోసం తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలంలో మొక్కలు వాడిపోయే ప్రమాదం ఉందని, మొక్కల పైన గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేసుకుంటే మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి

కేశంపేట, ఫిబ్రవరి 14: సంస్కృతీసాంప్రదాయాలు సజీవంగా ఉండాలంటే కళాకారులను ప్రోత్సహించాలని బీఆర్ఎస్ యువ నాయకుడు ప్రేమ్‌కుమార్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో ఎల్లమ్మ నాటక ప్రదర్శన కళాకారులను శుక్రవారం అభినందిస్తూ రూ.6వేల ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోకి అత్యంత వేగంగా వ్యాప్తి చెందడమేగాక గ్రామీణులకు సులువుగా అర్థమయ్యేది కళాకారుల ప్రదర్శనేనన్నారు. ప్రతిఒక్కరూ కళాకారులకు అండగా ఉండి సంస్కృతిని కాపాడుకుందామని కోరారు. కార్యక్రమంలో ఉదయ్‌గౌడ్, శ్రీనివాస్, రాములు, రామస్వామి, జంగయ్య, ఎల్లమయ్య, రామయ్య, అరవింద్, ప్రజాపతి, ఆసీఫ్ పాల్గొన్నారు.

డాక్టర్ అరుణ కుమారి.. టెన్త్ ఫెయిల్!

దుండిగల్, ఫిబ్రవరి 14: పదో తరగతి పాస్ కాలేదు.. కానీ..ఏకంగా డాక్టర్‌గా చెలామణి అవుతూ...ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఓ నకిలీ వైద్యురాలి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధుల బృందం శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రెండు క్లినిక్‌లు, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, మల్లంపేటలోని నాలుగు క్లినిక్ లపై దాడులు నిర్వహించింది. ప్రైవేట్ ప్రాక్టీస్ పేరుతో కొందరు ఎటువంటి అర్హతలు లేకుండానే వైద్యశాలలు నిర్వహిస్తున్నట్లు గుర్తించింది. ఎంబీబీఎస్ వంటి డిగ్రీలు లేకుండానే అల్లోపతి వైద్యం నిర్వహిస్తూ, రోగులకు విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, వ్యాక్సిన్లు , పెయిన్ కిల్లర్లు ఇస్తున్నట్లు తేలింది. నిజాంపేటలో బుచ్చిబాబు క్లినిక్ పేరుతో అరుణ కుమారి అనే నకిలీ వైద్యురాలు ఏకంగా మహిళలకు అబార్షన్లు చేస్తున్నట్లు గుర్తించారు. ఆమె కనీసం టెన్త్ క్లాస్ కూడా పాస్ కాలేదని కమిషన్ సభ్యులు పేర్కొన్నారు. ఇలాంటి వారు అందించే వైద్యంతో రోగులు మరింత ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నకిలీ వైద్యుల గుర్తింపులో భాగంగా తరచూ ఇటువంటి తనిఖీలు చేపడుతున్నామని, ఇప్పటికే తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 400కు పైగా నకిలీ వైద్యులను గుర్తించి కేసులు నమోదు చేశామన్నారు. ఒక్క హైదరాబాద్ మహానగర పరిధిలోనే ఇప్పటివరకు 150 పైగా కేసులు నమోదైనట్లు చెప్పారు. ప్రైవేట్ ప్రాక్టీషనర్స్ పేరుతో ఎటువంటి అర్హతలు లేకుండా అల్లోపతి వైద్యం అందిస్తున్న వారితో పాటు, ఆయుర్వేద ఇతర వైద్యాశాలలో పేరుతోనూ అల్లోపతి వైద్యం అందించడం నేరమన్నారు. కనీసం పదో తరగతి ,ఇంటర్ కూడా ఉత్తీర్ణులు కానీ వారు అందించే వైద్యంతో ప్రజలకు హాని జరుగుతుంది తప్ప.. ఎటువంటి మేలు జరగదన్నారు .వీరిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా , నిజాంపేటలోని బుచ్చిబాబు క్లినిక్, యక్ష్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ,మల్లంపేటలోని శ్వేతా క్లినిక్, సహజ హాస్పిటల్, జే.జే ఫస్ట్ ఎయిడ్ సెంటర్ లతో పాటు మొత్తం 6 క్లినిక్‌లలో తనిఖీలు నిర్వహించామని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

బుచ్చిబాబు పేరుతో క్లినిక్

ఎంబీబీఎస్ లేకున్నా..
అల్లోపతి వైద్యం..
అబార్షన్లు సైతం చేస్తున్న వైనం
నిజాంపేటలో
నకిలీ వైద్యురాలి
వ్యవహారం వెలుగులోకి..
కుత్బుల్లాపూర్ వ్యాప్తంగా
నేషనల్ మెడికల్ కౌన్సిల్
బృందం తనిఖీలు
పలు క్లినిక్‌లపై దాడులు..



అర్హత లేకున్నా వైద్యం
అందిస్తున్నట్లు గుర్తింపు

గేమింగ్ పరిశ్రమ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సుభాష్ సుప్రూ

గేమింగ్‌కు మున్ముందు మంచి రోజులు

సీఐఐ హెడ్ సుభాష్ సుప్రూ

పోచారం, ఫిబ్రవరి 14: రానున్న రోజులలో గేమింగ్ పరిశ్రమకు మంచి రోజులు వస్తాయని సీఐఐ హెడ్ సుభాష్ సుప్రూ అన్నారు. పోచారం మున్సిపాలిటీ వెంకటాపురంలోని అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం సీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు గేమింగ్ పరిశ్రమపై ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుభాష్ సుప్రూ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఐసీటీ అకాడమీ, ఇండియన్ గేమింగ్, డిజైన్ సొసైటీ, వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్టైన్మెంట్ తదితర సంస్థలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాయని తెలిపారు. ట్రేడింగ్, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవస్థాపకతను సీఐఐ ప్రోత్సహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.విష్ణు మూర్తి, ప్రొఫెసర్ వి.విజయ కుమార్, డీన్ డాక్టర్ మహిపతి శ్రీనివాసరావు, అడ్మిషన్స్ డైరెక్టర్ వి.శ్రీనివాస రావు, సమన్వయ కర్తలు పాల్గొన్నారు.

600 కిలోల హానికరమైన చికెన్ స్వాధీనం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ టాస్క్ ఫోర్స్, నార్త్‌జోన్ బృందం, కంటోన్మెంట్ శానిటరీ ఆఫీసర్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సికింద్రాబాద్‌లోని చికెన్ సెంటర్లపై దాడులు నిర్వహించారు. ఎస్ఎస్ఎస్ చికెన్ సెంటర్, రవి చికెన్ షాపులపై చేసిన దాడుల్లో హానికరమైన 600 కిలోల చికెన్ వేస్టేజ్, ఎముకలను స్వాధీనం చేసుకున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు, వైన్‌షాపులకు ఈ హానికరమైన చికెన్‌ను సరఫరా చేసేందుకు చికెన్ షాపుల ఓనర్లు ప్లాన్ చేసుకున్నారని, విశ్వసనీయ సమాచారంతో తాము దాడులు చేసి నిర్వాహకులు ఎం భాస్కర్, బొట్ట రవీందర్‌ను అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు.